క్లుప్తంగా

ఏసీ లా కళాశాల ప్రిన్సిపాల్‌గా గురవయ్య



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏసీ లా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎ.గురవయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏసీ లా కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న తనను గత ఏఈఎల్సీ పాలకవర్గం అన్యాయంగా సస్పెండ్ చేసిందని తెలిపారు. హైకోర్టును ఆశ్రయించగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు తాను మళ్లీ ఏసీ లా కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. ఈసందర్భంగా గురవయ్యను పలువురు పాస్టర్లు, కళాశాల సిబ్బంది అభినందించారు.

1 నుంచి 'జగనన్న సురక్ష'



నగర కమిషనర్ కీర్తి చేకూరి(ఫైల్)

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో జగనన్న సురక్ష కార్యక్రమం జూలై 1 నుంచి జరుగుతుందని, కమిషనర్, అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లతో ప్రత్యేక అధికార బృందాలను ఏర్పాటు చేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, హౌస్ హోల్డ్ విభజన, సంక్షేమ పథకాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణకు కార్యదర్శులు, నోడల్ అధికారులు తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సురక్ష సభ జరిగే ప్రాంతంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామని, ప్రజలు ముందుగా తమ సమస్యలను డెస్క్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

రోటరీ క్లబ్ సెంటినియల్‌కు అవార్డులు



పాతగుంటూరు: రోటరీ 3150 జిల్లా గవర్నర్ టి.రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 25న గుంటూరులో జరిగిన ఆదుర్స్ అవార్డు నైట్ కార్యక్రమంలో తమ క్లబ్‌కు 16 అవార్డులు వచ్చాయని రోటరీ క్లబ్ ఆఫ్ సెంటినియల్ అధ్యక్షురాలు కందిమళ్ల స్వప్న హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం రింగ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. అవార్డులను ప్రదర్శించారు. పాస్ట్ ప్రెసిడెంట్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 144 క్లబ్‌లు పాల్గొనగా సెంటినియల్‌కు అవార్డులు దక్కాయని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజగోపాల్ పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

యువకుడిపై పోక్సో కేసు

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడి చేసిన యువకుడిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేవీపీకాలనీకి చెందిన యాసవరపు భాస్కర్ అదే ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి ఈనెల 20న ఇంటి నుంచి తీసుకెళ్లాడు. అనంతరం లైంగిక దాడికి పాల్పడ్డాడు. మంగళవారం బాలికను ఆమె ఇంటి సమీపంలో వదిలి వెళ్లాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

బూత్‌స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి

గుంటూరు మెడికల్: 'మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్' కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా కార్యకర్తలను ఉద్దేశించి భోపాల్ నుంచి మాట్లాడిన కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ సీనియర్ నాయకుడు వల్లూరు జయప్రకాష్‌నారాయణ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలు వీక్షించారు. కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ బూత్‌స్థాయిలో తమ పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాలపాటి రవికుమార్, మండల అధ్యక్షుడు వెంకటేష్, నరసింహారావు, దారా అంబేడ్కర్, దర్శనపు శ్రీనివాస్, అనుమోలు ఏడుకొండలు, రాయ నాగేశ్వరరావు, విస్తారక్ రమేష్, వెంకట్, లలిత్, కన్నెగంటి శ్రీనివాస్, వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక కొత్తపేటలోని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ ఉమాశంకర్ కార్యాలయంలోనూ పలువురు బీజేపీ నేతలు టీవీలో ప్రధాని మోదీ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్ జైన్, పోతురాజు వెంకట్, మోతె శేషగిరి, సత్యనారాయణ, వేమూరి అనిల్, తాళ్లం మనోజ్ కుమార్, శివ రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి



స్థానికులు చెబుతున్న సమస్యలు వింటున్న ఎంపీ అయోధ్య, ఎమ్మెల్యే ముస్తఫా తదితరులు

పట్నంబజారు: అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కుదరదు.. రాష్ట్రంలో కొనసాగుతోంది పేదల ప్రభుత్వం.. ఇష్టానుసారంగా వ్యవహరించినా.. పనుల్లో ఆలస్యం జరిగినా ఎట్టి పరిస్థితుల్లో చూస్తూ ఊరుకోబోమని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా జిల్లాల కో–ఆర్డినేటర్ ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి స్పష్టం చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 10, 11 డివిజన్ల పరిధిలోని సుద్దపల్లి డొంక, క్రైస్తవుల సమాధుల రోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న యూజీడీ పనులను ఎమ్మెల్యే ముస్తఫాతో కలిసి మంగళవారం అయోధ్యరామిరెడ్డి పరిశీలించారు. అధికారుల నుంచి మ్యాప్ తెప్పించి.. పనులు జరిగిన విధానం, ప్రస్తుతం జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. క్రైస్తవుల సమాధుల వద్ద సుమారు 10 అడుగుల మేర ఎందుకు పైపులైను నిలిచిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరోమారు ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవాలని సూచించారు. అధికారుల తప్పిదం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, త్వరగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. వేసవి నాటికే పనులు పూర్తి కావాల్సి ఉందని ఆలస్యం కావటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీకలవాగు, యూజీడీ పనులను క్షుణ్ణంగా పర్యవేక్షించిన ఆయన పనులు ఎట్టి పరిస్థితుల్లో ఆలస్యం కాకూడదని తేల్చిచెప్పారు. ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే ముస్తఫా అధికారులు, ప్రభుత్వం తీసుకుని వెళ్ళే యత్నం చేశారని, అది చాలా చిన్న విషయమన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు దృష్టి సారిస్తున్నామని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పలు నివాసాలు మునిగిపోతాయని ఎమ్మెల్యే ముస్తఫా ఆందోళన చెంది అధికారులను అడిగారన్నారు. సీఎం జగన్ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నారన్నారు. టీడీపీ నేతలు కేవలం వారి ఉనికి కాపాడుకునేందుకు రాజకీయం చేస్తున్నారని, 14 ఏళ్లలో వారు ఏం చేశారని ప్రశ్నించారు. తూర్పు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు. ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సమస్యలను అయోధ్యరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. పరిష్కారానికి ఎంపీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, షేక్ నూర్ ఫాతిమా, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు 3 రోజులే గడువు

నెహ్రూనగర్: ఆస్తి పన్నుపై వడ్డీ లేకుండా చెల్లించడానికి 3 రోజులే గడువు ఉందని, బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 మొదటి అర్ధ సంవత్సరానికి వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లించడానికి ఈనెలాఖరు వరకే గడువు ఉందని, జూలై 1 నుంచి పన్ను బకాయిపై రూ.100కి రూ.2 వడ్డీ పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే డిమాండ్ నోటీసులు సచివాలయాల వారీగా పంపిణీ చేశామని, ఎవరికైనా అందకుంటే అందుబాటులోని వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శి ద్వారా తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఆస్తి, నీటి, ఖాళీ స్థల పన్నులు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్లతోపాటుగా భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్‌లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్‌లోని 148 వార్డ్ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన క్యాష్ కౌంటర్లలో కూడా చెల్లించవచ్చని వివరించారు.

మద్యం విక్రేత అరెస్ట్

నగరంపాలెం: అక్రమంగా పొరుగు రాష్ట్రం మద్యం సీసాలు విక్రయిస్తున్న పాత నేరస్తుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ (సెబ్) గుంటూరు –1 స్టేషన్ సీఐ ఎం.రమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎస్ఈబీ–1, డీఎస్ఈఓ పోలీసులు మంగళవారం నల్లచెరువు ఏడో వీధిలోని ఓ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తెలంగాణకు చెందిన మద్యం సీసాలను గుర్తించారు. వాటిని విక్రయిస్తున్న షేక్ ఇంతియాజ్ అలియాస్ మున్నాను అరెస్ట్ చేశారు. రూ.21,750 విలువ చేసే 29 ఫుల్ బాటిళ్లను సీజ్ చేశారు. 2021లో మున్నాపై ఎస్ఈబీ –1 స్టేషన్‌లో కేసు ఉందని, ఆటోడ్రైవర్‌గా, మెకానిక్‌గా పనిచేస్తాడని సీఐ చెప్పారు. రైళ్లల్లో వెళ్లి మద్యం సీసాలను తీసుకొచ్చి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు వివరించారు. తనిఖీల్లో డీఎస్ఈఓ సీఐ అంటోని, ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

గుంటూరు ఈస్ట్: మహిళ కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీఅగ్రహారానికి చెందిన 25 ఏళ్ల మహిళ ఈనెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు రాజకీయ శిక్షణ అవసరం

కేరళ ఎంపీ సంతోష్‌కుమార్




సభలో మాట్లాడుతున్న కేరళ ఎంపీ సంతోష్‌కుమార్

పాతగుంటూరు: దేశంలో రాజ్యాంగ వ్యతిరేక మతోన్మాద విచ్ఛిన్నకర శక్తుల ఆట కట్టించేందుకు యువత సంసిద్ధులు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక సాంస్కృతిక సమ్మేళనం ప్రారంభమైంది. సభకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కేరళ ఎంపీ పి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ సైంటిఫిక్ సోషలిజం కోసం పనిచేసే సంఘం ఏఐవైఎఫ్ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు పాల్గొన్నారు.

రైతన్నలూ.. నకిలీలతో పారాహుషార్..!

తొలకరి పలకరించింది. వానలు వచ్చేశాయి. కాడి పట్టేందుకు కర్షకులు సిద్ధమవుతున్నారు. పంట సాగులో కీలకమైన విత్తు కొనుగోళ్లు మొదలయ్యాయి. దిగుబడుల దశ, దిశను మార్చే విత్తనాల కొనుగోలు సమయంలో రైతన్న ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా, తప్పటడుగు వేసినా మిగిలేది నష్టాలే. అందుకోసమే రైతులు విత్తనాలు కొనేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు వ్యవసాయాధికారులు.

- పత్తి, మిర్చి విత్తనాలు కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- ఇప్పటికే తనిఖీలు ప్రారంభించిన యంత్రాంగం
- ఆర్బీకేల్లో విత్తనాల కొనుగోలు సురక్షితం..



పత్తి విత్తనాలు

ప్రత్తిపాడు: గత ఏడాది బహిరంగ మార్కెట్‌లో అక్కడక్కడా నకిలీ జాడలు కనిపించాయి. కొందరు రైతులు సాగుచేసిన పంట ఏపుగా విపరీతంగా పెరిగినప్పటికీ దిగుబడులు రాని పరిస్థితి చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు దుకాణాల్లో ఇప్పటికే విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ప్రత్తిపాడు మండలంలోని పెదగొట్టిపాడులో జిల్లా వ్యవసాయాధికారి ఇప్పటికే తనిఖీలు చేయగా, వ్యవసాయాధికారులు కూడా వారి పరిధిలో ఉన్న దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలో 25 దుకాణాలకు అనుమతులున్నాయి. ఆయా దుకాణాల నుంచి మొత్తం 28 శాంపిల్స్‌ను సేకరించగా, వాటిలో ఇప్పటి వరకు రెండు శాంపిల్స్ జెర్మినేషన్ పరంగా ఫెయిల్ అయ్యాయి. ఆయా దుకాణాల నిర్వాహకులపై కేసుల నమోదుకు వ్యవసాయశాఖ రంగం సిద్ధం చేస్తోంది.

రైతు భరోసా కేంద్రాల్లో కొనోగోలు చేస్తే మేలు..

రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు కొనుగోలు చేస్తే పూర్తిగా నకిలీల బెడద రైతన్నలకు తప్పుతుంది. ఒకటికి రెండు సార్లు నిర్ధారించి, అన్ని రకాల పరీక్షలు పూర్తయిన తరువాతనే ఆర్‌బీకేలకు ప్రభుత్వం విత్తనాలను సరఫరా చేస్తుంది. దీంతో ఆర్‌బీకేల్లో విత్తనాలను కొనుగోలు చేస్తే రైతుకు కొండంత భరోసా లభిస్తుంది. మండలంలో 13 ఆర్‌బీకేలు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ఐదు వేల ఎకరాల్లో పత్తి, పది వేల ఎకరాల్లో మిర్చిసాగుచేసే అవకాశాలున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేస్తుంది. అందుకనుగుణంగా కావలసినన్ని పత్తి విత్తనాలు ఆర్‌బీకేలకు తెప్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు ఇవీ..

- వ్యవసాయశాఖ ద్వారా లైసెన్సు పొందిన డీలర్ల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొన్న సమయంలో వ్యాపారి నుంచి బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి.
- జిన్నింగు లేదా లూజుగా ఉన్న పత్తి విత్తనాలు, కంపెనీ పేరు లేని విత్తనాల ప్యాకెట్‌లు కొనుగోలు చేయకూడదు.
- పగిలిన ప్యాకెట్‌లు, గడువుదాటిన విత్తనాల జోలికి ఎలాంటి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదు.
- రైతుకు ఇచ్చే బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు నంబరు, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, విత్తన రకం పేరు, బ్యాచ్ నంబరు, గడువు తేది, నికర తూకం, నికర ధరతో పాటు కంపెనీ పేరు తప్పని సరిగా ఉండాలి. పై వివరాలన్నీ ఉంటేనే బిల్లును తీసుకోవాలి.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సంచులపై కంపెనీ సీలు ఉన్నదో లేదో గమనించుకోవాలి.
- విక్రయదారుడు ఇచ్చిన బిల్లును పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలి.
- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినప్పటికీ బిల్లును మాత్రం ఖచ్చితంగా తీసుకోవాలి.
- విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని పరిశీలించుకోవాలి.
- మొలకశాతం సంతృప్తిగా ఉన్న విత్తన రకాలనే వినియోగించడం ద్వారా మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. పత్తికి 75 శాతం, మిర్చికి 60 శాతం ఉండాలి.
- ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడం, ఇంటి వద్దకు వచ్చి అమ్మే వారి నుంచి కొనడం వంటివి చేయకూడదు.

ప్రశాంతంగా బక్రీద్, తొలి ఏకాదశి జరుపుకోవాలి



ఇరువర్గాల పెద్దలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

కొండపాటూరు(కాకుమాను): ఈ నెల 29న బక్రీద్, తొలి ఏకాదశి పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ సూచించారు. కొండపాటూరులోని సర్వే నంబరు 295లో గ్రామ కంఠం భూమికి సంబంధించి కొన్నేళ్లగా గ్రామంలోని మైనార్టీ, బీసీల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో బక్రీద్, తొలి ఏకాదశి పండుగలు ఉండటంతో.. ఇరు వర్గాల ప్రజలు ఆ స్థలంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అయితే ఇరు వర్గాల మధ్య ఎలాంటి గొడవలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. ఇరు వర్గాల పెద్దలతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ పండుగ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. త్వరలోనే స్థల సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు డీఎస్పీ మహబూబ్ బాషా, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు, ఎస్ఐ. రవీంద్ర, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలిన



రికార్డులు పరిశీలిస్తున్న తెనాలి డీఎల్‌పీఓ స్వరూపారాణి

కాకుమాను: స్థానిక పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను మంగళవారం తెనాలి డీఎల్‌పీఓ స్వరూప రాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. 2018–22 సంవత్సరాలకు సంబంధించి పంచాయతీ రికార్డులను పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈఓపీఆర్డీ జవహర్ లాల్ నెహ్రూ, సిబ్బంది ఉన్నారు.

13 మంది జూదరులపై కేసు

గుటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న 13 మందిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం సాయిబాబా రోడ్డులో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు మంగళవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.52 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దళిత హక్కుల ఉద్యమంలో ఎనలేని కృషి



బొజ్జా తారకం చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న వినయ్‌కుమార్

నెహ్రూనగర్: రాష్ట్రంలో పౌర, దళిత హక్కుల ఉద్యమాలలో ప్రముఖ పాత్ర పోషించిన మహనీయుడు బొజ్జా తారకం అని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ తెలిపారు. బొజ్జా తారకం 84వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని డీబీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొజ్జా తారకం దళిత హక్కుల కోసం 50 ఏళ్లపాటు పోరాడారని కొనియాడారు. సామాజిక న్యాయవాదులను తీర్చిదిద్దేందుకు దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో బొజ్జా తారకం న్యాయ విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

అరండల్‌పేటలో..

దళిత బహుజన ఉద్యమ నిర్మాణంలో అలుపెరగని ప్రయాణం చేసిన మహనీయులు బొజ్జా తారకం అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో తారకం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాష్ మాట్లాడుతూ తారకం సేవలను కొనియాడారు.

జాబ్ మేళాలో 59 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో నాగభూషణం, రమేష్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం చెన్నైకు చెందిన ఎపిసోర్స్ సంస్థ మెడికల్ కోడింగ్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన జాబ్‌మేళాలో 59 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. వివిధ ఫార్మసీ కళాశాలల నుంచి జాబ్‌మేళాలో పాల్గొన్న 144 మంది విద్యార్థులకు వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక పరీక్షల అనంతరం 59 మంది విద్యార్థులు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులైనట్లు వివరించారు. ఎపిసోర్స్ కంపెనీ డైరెక్టర్ జె.రమేష్ మాట్లాడుతూ సంస్థ వివరాలు, ఎంపికైన వారికి ఇచ్చే ప్యాకేజీ, ఇతర అలవెన్సుల గురించి వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ఫార్మా.డి డైరెక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు, ఎపిసోర్స్ హెచ్ఆర్ మేనేజర్ రియాజ్, కళాశాల పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ఉల్లంఘనకు పాల్పడితే దుకాణాలు సీజ్



ప్రత్తిపాడు గ్రోమోర్‌లో విత్తనాలు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఏవో అరుణకుమారి

ప్రత్తిపాడు: ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనకు పాల్పడితే దుకాణాలను సీజ్ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి హెచ్చరించారు. ప్రత్తిపాడులోని మన గ్రోమోర్‌లో మంగళవారం ఏవో ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, ఇతర రికార్డులతో పాటు గోడౌన్లలో ఉన్న స్టాకును పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయాలు చేపట్టాలని సూచించారు. దుకాణంలో విక్రయాలకు సిద్ధంగా ఉన్న పలు కంపెనీల విత్తన ప్యాకెట్ల శాంపిల్స్ తీసి, ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు కచ్చితంగా బిల్లులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయాలు జరపాలని, లేని పక్షంలో స్టాకుతో పాటు తీవ్రతను బట్టి దుకాణాలను కూడా సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతులు కూడా విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆర్బీకేల ద్వారా విత్తనాలను కొనుగోలు చేసుకోవడం ద్వారా నకిలీల భయం ఉండదని స్పష్టం చేశారు.

దోమకాటుతో ప్రాణాంతక వ్యాధులు

సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రశాంత్



గొట్టిపాడులో మలేరియాపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): దోమ కాటుతో ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రశాంత్ అన్నారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పెదగొట్టిపాడులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవం నిర్వహించారు. స్థానిక ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. దోమ పుట్టకుండా, కుట్టకుండా చర్యలు తీసుకుందాం, ఫ్రైడే డ్రైడే.. అంటూ అంటూ నినాదాలు చేశారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ముఖ్య అతిథి సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రశాంత్ ఆరోగ్య సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌యూఓ మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటి ప్రదేశాలను గుర్తించి దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. మలేరియా నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చెప్పారు. దోమకాటుతో డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు సోకుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మేరి యునిస్, ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం

జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు షేక్ జిలాని



మసీదు వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలాని, సెక్రటరీ సమీ ఉల్లాబేగ్

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలాని అన్నారు. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం, పెదనందిపాడు మండలంలోని అబ్బినేని గుంటపాలెం, వరగాని, నాగులపాడు, పెదనందిపాడు, గుంటూరు రూరల్ మండలం గోరంట్లలోని మసీదుల్లో మంగళవారం జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ జిలానీ ఆధ్వర్యంలో హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, దువాల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులతో జిలానీ మాట్లాడారు. ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అన్న వివరాలను స్థానిక నేతలు, మత పెద్దలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. మసీదుల్లోని ఇమామ్‌లు, మౌజన్లకు ఆర్థికంగా అండగా నిలిచే కార్యక్రమాలు గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వాలూ చేయలేదని చెప్పారు. ముస్లింల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపుతున్నారని తెలిపారు. మైనార్టీల అభ్యున్నతికి ఎల్లప్పుడూ ముందంజలో ఉండేది ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ముస్లింలు స్థానిక ఎమ్మెల్యే సుచరితకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సమీ ఉల్లా బేగ్, డైరెక్టర్లు కరిముల్లా, జానీబాషా, పెదనందిపాడు మండల మైనారిటీ సెల్ కన్వీనర్ అబ్దుల్లా, మసీదు కమిటీల సభ్యులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.